క్లుప్తంగా

సిద్ధేశ్వరాలయంలో ఎమ్మెల్సీ పూజలు



పండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి దంపతులు

హవేళీఘనపూర్: మండలంలోని ముత్తాయి కోట సిద్ధేశ్వరాలయంలో సోమవారం ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఎమ్మెల్సీ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో సర్పంచ్ వేణు, మహిపాల్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

క్విజ్ పోటీలు



విజేతలకు నగదు అందిస్తున్న దృశ్యం

మెదక్: హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కోసం సోమవారం మెదక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాన్ బాస్కో పాఠశాలకు చెందిన విద్యార్థికి మొదటి బహుమతి కింద రూ. వెయ్యి అందించారు. బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి కింద రూ.750, తృతీయ బహుమతి కింద రూ.500 గెలుపొందారు. కార్యక్రమంలో హెచ్ఎం రేఖ, ఎంఈఓ సుదర్శన్ మూర్తి, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రాజగోపాల్ గౌడ్, వైద్య సిబ్బంది కే.రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోతాదు ఎరువులతో మేలు



పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజేశ్

అల్లాదుర్గం(మెదక్): పంటల సాగులో మోతాదు ఎరువులు వాడాలని ఏఓ రాజేశ్ అన్నారు. సోమవారం ముస్లాపూర్ గ్రామంలో పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. అవసరం లేకున్నా ఇష్టారీతిన ఎరువులను చల్లడంతో ఖర్చు పెరగడంతో పాటు, పంటకు తెగుళ్ల బెడద ఉంటుందన్నారు. సాగులో సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు.

సమస్యల పరిష్కారానికే బస్తీబాట..



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

రామాయంపేట: మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులో సోమవారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బస్తీబాట నిర్వహించారు. కౌన్సిలర్లు, అధికారులు వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పాక్షికంగా శిథిలమైన రోడ్లు, డ్రైనేజీలను బాగు చేయిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం పశువుల ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెల దాణాను లబ్ధిదారులకు అందించారు. ఆయనతో వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు దేవుని రాజు, రాజు యాదవ్ ఉన్నారు.

కొనసాగిన దీక్ష



దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం రెవెన్యూ డివిజన్‌గా, బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు, మంజూరైన కోర్టు, సబ్ ట్రెజరీ కార్యాలయాలను ప్రారంభించాలని జేఏసీ నాయకులు చేస్తున్న దీక్ష మూడో రోజు కొనసాగింది. చిల్వేర ఐబీ చౌరస్తాలో చేపట్టిన దీక్షలో సోమవారం పలువురు నిరసన తెలిపారు. ఇందులో బ్రహ్మం రమేశ్, శ్రీనివాస్, రుక్మానాయక్, రాంచేందర్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

పాలకవర్గం కొనసాగింపు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ శ్రీ భ్రమరాంబసహిత మల్లికార్జున స్వామి దేవాలయ ప్రస్తుత కార్యవర్గం మరో ఏడాది పాటు కొనసాగనున్నట్లు చైర్మన్ మల్లేశం పేర్కొన్నారు. నూతన కమిటీ ఎంపిక కోసం సోమవారం జరిగిన సమావేశంలో సభ్యులు, ప్రజలు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారని, ప్రస్తుత కమిటీలోకి నూతనంగా మరో ముగ్గురికి చోటు కల్పించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

స్వయం ఉపాధితో స్వావలంబన

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



కుట్టు మిషన్ కుడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు, మిషన్ మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కుట్టు శిక్షణతో ఎన్నో కుటుంబాలు బాగుపడుతున్నాయని, కొద్దిగా కష్టపడితే ఫ్యాషన్ డిజైనర్లుగా రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, నిజాంపేట ఎంపీపీ దేశెట్టి సిద్దరాంలు, చల్మెడ, నందిగామ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, లద్ద సురేశ్, నందిగామ సర్పంచ్ లద్ద ప్రీతి, న్యాక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

జిల్లా, మండల మహిళా సమాఖ్య ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండల మహిళా సమాఖ్య ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని ఆమె హామీ ఇచ్చారు.

ఆర్థికంగా రాణించాలి

హవేళీఘనపూర్: మత్స్యకారుల అభివృద్ధికి అందిస్తున్న సబ్సిడీపై చేప పిల్లలతో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోంటూర్ చెరువులో 1,85,500 చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో మత్స్యకారులను పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. చేప పిల్లల పంపిణీతో పాటు మార్కెటింగ్ సౌకర్యం, ద్విచక్ర వాహనాలు అందిస్తున్నాని కొనియాడారు. కోంటూర్ వద్ద చేపలు విక్రయించేందుకు మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ముదిరాజ్ సంఘ భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మత్స్యశాఖ ఏడీ రజిని, సర్పంచ్ రవి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, అంజాగౌడ్, సిద్దాగౌడ్, కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల కోసమే ప్రభుత్వ పథకాలు

చిన్నశంకరంపేట(మెదక్): పేదల కోసమే ప్రభుత్వం పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మడూర్, శాలిపేట గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. శాలిపేటలో 71మందికి గొర్రెలను పంపిణీ చేసి, మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించి, బీసీ సంఘం భవనానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోచయ్య, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మడూర్ సర్పంచ్ నర్సమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం



మల్కాపూర్‌లో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆర్టీసీ బస్ సర్వీసును మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సోమవారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గజ్వేల్ నుంచి బయల్దేరే ఈ బస్ 20 గ్రామాల ప్రయాణికులకు సేవలు అందిస్తుందన్నారు. ఆయా గ్రామాలలో బస్సులో ప్రయాణించే పాఠశాల, కళాశాల విద్యార్థులకు అందించే బస్సు పాసుల కోసం తన వంతు సహాయంగా 500 మందికి రూ.25వేలను విరాళంగా ఆర్టీసీకి అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ, సర్పంచ్ మన్నెమహాదేవి నవీన్, ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేష్ యాదవ్, ప్యాక్స్ డైరెక్టర్ గోపి, గ్రామ కమిటీ అధ్యక్షుడు స్వామి, వార్డు సభ్యులు, మేకస్ యువత, కార్యదర్శి అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూముకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్న శంకరంపేట–అంబాజిపేట పెద్ద చెరువులో తూముకు మరమ్మతు చేపట్టారు. సోమవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన వాగులోకి అంబాజిపేట పెద్ద చెరువు నీరు' కథనానికి ఇరిగేషన్ డీఈ నర్సింహారెడ్డి స్పందించారు. చెరువును పరిశీలించి తూము నుంచి నీరు పోకుండా మట్టి, ఇసుక బ్యాగులు వేయించారు.



తూము వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం వీరోజిపల్లికి చెందిన విక్రమ్‌గౌడ్‌కు మంజూరైన రూ.59 వేల చెక్కును ఆయన అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పెద్దశంకరంపేటలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, దత్తు, సీనియర్ నాయకులు ఆర్ఎస్.సంతోష్, పున్నయ్య, అమర్ తదితరులున్నారు.

చెక్కులు పంపిణీ..

నర్సాపూర్: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సాయగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, వీరేశం, జీవన్‌రెడ్డి, లాయక్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోశాల ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): మండలంలోని దాదాయిపల్లి గ్రామంలో నర్సింహరావ్ దేశపాండే, విక్రందేశ్‌పాండే ఆధ్వర్యంలో సోమవారం శ్రీ రాదామనోహర్ గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, రుద్రహోమం, సహస్రలింగార్చన, నవచండి హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

సభ్యత్వ నమోదు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాలలో సోమవారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోచయ్య మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దళితబంధు అందరికీ ఇవ్వాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

అల్లాదుర్గం(మెదక్): అర్హులైన ప్రతీ కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని చెవెళ్ల గ్రామ దళితులు డిమాండ్ చేశారు. సోమవారం అల్లాదుర్గం ఎంపీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, అనంతరం ఎంపీడీఓ శంకర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో బీఆర్ఎస్ నాయకులకే దళితబంధు ఇస్తున్నారని, 120 కుటుంబాలు ఉంటే కేవలం నలుగురికే ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. ఇందులో గ్రామస్తులు సంగమేశ్వర్, యాదగిరి, సాయిలు, అనిల్, నవీన్, అశోక్, తుకారం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ

పెద్దశంకరంపేట(మెదక్): అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని కోరుతూ కుల వివక్ష పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ కోరారు. సోమవారం గాంధీ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు దళితులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భూమయ్య, లక్ష్మయ్య, ప్రభాకర్, శంకర్, రమేష్, సుభాష్, సాయిలు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 31న రాఖీ పౌర్ణమి

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 31న రాఖీ పౌర్ణమి పండుగ జరుపుకోవాలని పండితులు శాస్త్రుల పురుషోత్తమశర్మ, వామనశర్మ సోమవారం తెలిపారు. కొందరు 30న అని చెప్పడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. శాస్త్ర ప్రకారం ఈ నెల 31న ఉదయం నుంచి జరుపుకోవాలని సిద్ధాంత కమిటీ నిర్ణయించినట్లు చెప్పారు.

◆ వలంటీర్ వేతనం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్ల ప్రాథమిక పాఠశాల వలంటీర్‌కు సోమవారం వేతనం అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా సొంత నిధులతో ఏర్పాటు చేసి, నెలకు 6 వేల వేతనం అందజేస్తున్నారు. కాగా ఆ నగదును పంపించడంతో సర్పంచ్ రవి అందజేశారు.

◆ నియామకం..

అల్లాదుర్గం(మెదక్): జై గణేశ్ భక్తి సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపుర్‌కు చెందిన తమ్మలి సంతోష్ కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జైన్ కుమార్ చారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

◆ బాధ్యులను శిక్షించాలి

మెదక్ మున్సిపాలిటీ: ఆర్టీఏ ఏజెంట్ వ్యవస్థను రద్దు చేయాలన్నందుకు తనపై కత్తి, రాళ్లతో దాడిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వంజరి రఘువరన్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఆర్టీఓ కార్యాలయం వద్ద బ్రోకర్లను నిర్మూలించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు బ్రోకర్లు తనపై దాడిచేశారని తెలిపారు.

◆ వర్కర్లుగా గుర్తించాలి

మెదక్ కలెక్టరేట్: పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పశు మిత్రల పరిస్థితి జిల్లాలో అత్యంత దయనీయంగా మారిందన్నారు. కనీస వేతనం, గుర్తింపు కార్డులు, యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, మందులు అందించాలని కోరారు. కార్యక్రమంలో రేణుక, మహేశ్వరీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

◆ చర్యలు తీసుకోవాలి

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాలలో క్రీడా ప్రాంగణం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజేందర్ పాటిల్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఈశ్వరప్ప, నాయకుడు మల్లేశం కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కొంత మంది ఈ స్థలంలో ప్లాట్లను చేయాలని చూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

◆ విద్యుత్ అధికారులు స్పందించాలి

హవేళీఘనపూర్: మండలంలోని బ్యాతోల్ శివారు పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్‌ను ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు స్పందించడంలేదని గ్రామ రైతులు ఆరోపించారు. ప్రమాదం జరగర ముందే అధికారులు స్పందించాలని లేదంటే విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

◆ అవకాశమిచ్చిన పార్టీలకే మద్దతు

కొండపాక(గజ్వేల్): చట్టసభల్లో అవకాశం కల్పించిన పార్టీలకే మద్దతు ఉంటుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. మండల పరిధిలోని బందారంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు జిర్ర రాజు ఆధ్వర్యంలో సోమవారం మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్, అంజయ్య, నర్సింలు, శ్రీనివాస్, కొండల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తా

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంటలో బీఆర్ఎస్ కార్యకర్త ప్రకాశ్‌కు చెందిన హోటల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి అన్ని గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంగళ్‌రావ్ పాల్గొన్నారు.

చెట్ల రక్షణతో మానవ మనుగడ



ఫైజాబాద్‌లో చెట్టుకు దారాలు చుడుతున్న ధర్మ జాగరణ సభ్యులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చెట్లను రక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ధర్మ జాగరణ సభ్యులు అన్నారు. సోమవారం మండలంలోని బండపోతుగల్, ఫైజాబాద్‌లో ప్రకృతి వందన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పలు చెట్లకు దారాలు చుట్టి, పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలని, సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, విఠల్, ఆంజనేయులు, గోవర్దన్, రవీందర్, శ్రీశైలం, రమేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం వీడాలి



రోడ్డు పరిస్థితిని వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట(మెదక్): నస్కల్ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు, ప్రతిపక్షాలు కోరినా ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ, టీపీసీసీ సభ్యుడు సుప్రభాతరావు అన్నారు. సోమవారం మండలంలోని నస్కల్ రోడ్డును పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. నిజాంపేట నుంచి నస్కల్ వెళ్లే రోడ్డు మరమ్మతు కోసం గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన్నట్లు తెలిపారు. రోడ్డు బాగోలేక నస్కల్, రాంపూర్, నందగోకుల్, నగరం గ్రామాల నుంచి కామారెడ్డికి వెళ్ళే బస్సులు, ఆటోలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని లేదంటే ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, హఫీజ్ మొల్సబ్, డాకి స్వామి, అల్లాడి వెంకటేష్, మాసుల సిద్ధరాములు, ప్రవీణ్ కుమార్, అజీజ్, జాకీర్ నవీన్, చౌదరి, తలహ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ రంజిత్

రామాయంపేట(మెదక్): సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ రంజిత్ సూచించారు. సోమవారం ఝాన్సిలింగాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని, వేధింపులకు గురిచేస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని సోమవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న సత్యనారాయణస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు, సుధీర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



విద్యార్థుల ప్రదర్శన

తూప్రాన్: భారతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా సోమవారం గీతా పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మైదానంలో 'నేషనల్ స్పోర్ట్స్ డే' ఆకారంలో కూర్చొని అక్షరాలను చేతబట్టుకుని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకట కృష్ణారావు విద్యార్థులను అభినందించారు.

రెగ్యులర్ చేయండి



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

మెదక్ కలెక్టరేట్: ఏళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని సెకండ్ ఏఎన్ఎంలు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తస్వీర్, దుర్గ, రమ్య, విజయ, తులసి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చరూ..



రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

నర్సాపూర్: పట్టణంలోని నర్సాపూర్ – తూప్రాన్ రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలువడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు నీటిలో నుంచి వెళ్లే సమయంల కింద పడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.